సాక్షి నల్లగొండ
గురువారం । 6 । ఏప్రిల్ । 2023



పునరావాసం కల్పించాలి
పునరావాసం కల్పించాలని కోరుతూ మాజీ మావోయిస్టు గజ్జల సత్యంరెడ్డి ఎస్పీ అపూర్వరావును కోరారు. - 8లో



పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు
ప్రస్తుతం ఎండలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో పండ్ల తోటలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38°/24°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-36 (గురువారం సాయంత్రం)
సహర్ 4-43 (శుక్రవారం ఉదయం)

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఇంటర్ మూల్యాంకనం



నల్లగొండ : ఇంటర్ మూల్యాంకనం కొనసాగుతోంది. నల్లగొండలోని ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతనెల 24 నుంచి మూల్యాంకనం ప్రారంభమైంది. మొదటిరోజు సాంస్కృతం పరీక్షపత్రం మూల్యాంకనం చేయగా.. 31న తెలుగు, హిందీ, ఇంగ్లిష్, పౌరశాస్త్రం, మ్యాథ్స్ మూల్యాంకనం ప్రారంభమైంది. ఈనెల 4వ తేదీన ఎకానమిక్స్, ఫిజిక్స్ ప్రారంభం కాగా 6వ తేదీన కెమిస్ట్రీ, కామర్స్, 9వ తేదీన బాటనీ, జ్యూయాలజీ, హిస్టరీ, పేపర్ల మూల్యాంకనం ప్రారంభంకానుంది. ఈనెల 18వ తేదీ వరకు మూల్యాంకనం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాకు 5.5 లక్షల పేపర్లు..
ఇంటర్ మూల్యాంకనానికి జిల్లాకు మొత్తం 5.5 లక్షల పేపర్లు రాగా వాటిని గత నెల 24 నుంచి మూల్యాంకనం చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 1500 మంది లెక్చరర్లు నల్లగొండకు వచ్చి మూల్యాంకనం చేస్తున్నారు. మూల్యాంకనం చేసేందుకు ఒకొక్కరికి రోజూ 30 పేపర్లు ఇస్తున్నారు. ఒక్కో పేపర్ దిద్దినందుకు రూ.23.66 చెల్లిస్తున్నారు. వీటితోపాటు అలవెన్స్‌గా.. ఎనిమిది కిలోమీటర్ల లోపు దూరం నుంచి వచ్చే వారికి రూ.188, 8 నుంచి 50 కిలోమీటర్ల లోపు వారికి రూ.300, 50 కిలోమీటర్ల పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.703 అదనంగా చెల్లిస్తున్నారు.

పాత పెన్షన్ రాజ్యాంగ హక్కు



మాట్లాడుతున్న శిరందాసు రామదాసు

నల్లగొండ టూటౌన్ : పాత పెన్షన్ ఉద్యోగ, ఉపాధ్యాయుల రాజ్యాంగ హక్కు అని, పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం ఆగదని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు అన్నారు. ఈనెల 16న నిర్వహించనున్న పాత పెన్షన్ సాధన ర్యాలీ సన్నాహక సమావేశాన్ని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల్లో సీపీఎస్ ఉద్యోగులు 16న నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. 16న నల్లగొండలోని ఎన్జీ కళాశాల నుంచి గడియారం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగమళ్లి ఉపేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దొంతిరెడ్డి పంకజ్‌రెడ్డి, కొండకింది శ్రీనివాస్‌రెడ్డి, కొరివి కృష్ణ, సైదయ్య, సోమలింగయ్య, ఏడుకొండల్, శ్రీహరి, కృష్ణ, రవికుమార్, అశోక్, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేయాలి



రామాలయంలో ప్రమాణం చేస్తున్న సుంకరి భిక్షంగౌడ్, భార్య ధనలక్ష్మి

రామగిరి(నల్లగొండ) : తనపై చేసిన ఆరోపణలు రుజువు చేయాలని పీఆర్‌టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్ డిమాండ్ చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని బుధవారం తన భార్య ధనలక్ష్మితో కలసి నల్లగొండలోని రామాలయంలో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని ప్రమాణానికి సిద్ధంగా ఉన్నట్లు ఏప్రిల్ 4న రాష్ట్ర కమిటీకి లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవరూ రాకున్నా.. తన భార్యతో కలిసి ప్రమాణం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాణంతోనైనా తనపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 గంటలు ఉద్రిక్తత.. ఉత్కంఠ

బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ ఎదుట హై టెన్షన్



బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ శ్రేణులను అరెస్టు చేస్తున్న పోలీసులు

- బండి సంజయ్‌ను మంగళవారం అర్ధరాత్రి దాటాక బొమ్మలరామారం తీసుకువచ్చిన పోలీసులు
- బుధవారం తెల్లవారుజాము నుంచే పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ ఆందోళన
- పోలీసుల లాఠీచార్జ్.. పలువురి అరెస్టు
- భారీ బందోబస్తు మధ్య వరంగల్‌కు సంజయ్ తరలింపు
- ఘర్షణ వాతావరణంతో అట్టుడికిన బొమ్మలరామారం



కారు అద్దాలకు న్యూస్ పేపర్లు అడ్డుగా పెట్టి బండి సంజయ్‌ను తరలిస్తున్న పోలీసులు

బొమ్మలరామారం : పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ అభియోగం కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి అరెస్ట్ చేసిన పోలీసులు 2.30 గంటలకు బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కొద్దిసేపటికే సమాచారం అందుకున్న బీజేపీ కార్యకర్తలు, నాయకులు బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు రావడం మొదలుపెట్టారు. భువనగిరి మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్ తెల్లవారుజామున 4 గంటలకు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని బండి సంజయ్‌ని కలిశారు. సంజయ్‌ను కోర్టుకు తీసుకెళ్లే వరకు ఆయనకు తోడుగా పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నారు. కార్యకర్తలు తెల్లవారేసరికి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ ఆందోళన చేపట్టారు. అంతకంతకూ కార్యకర్తల సంఖ్య పెరిగిపోవడంతో ఆందోళన తీవ్ర స్థాయికి చేరింది. పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేసి కార్యకర్తలను చెదరగొట్టారు. బండి సంజయ్‌ను కలువడానికి బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌కు ఎమ్మెల్యేల, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నేతలు రాగా.. వారిని పోలీసులు అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. స్టేషన్ గేటు ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్ల పైనుంచి పలువురు కార్యకర్తలు దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు, పార్టీ శ్రేణుల తోపులాటతో 7.40 గంటలకు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీస్‌స్టేషన్‌లో లీగల్ ప్రాసెస్ పూర్తి చేసిన తర్వాత సంజయ్‌ను ఉదయం 10.26 గంటలకు భారీ బందోబస్తు మధ్య వరంగల్‌కు తరలించారు. 8గంటల పాటు పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా చోటుచేసుకుంది.

ముఖ్యనేతల అరెస్టు
బండి సంజయ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించిన కార్యకర్తలతో పాటు పలువురు ముఖ్య నాయకులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం 7.35 గంటలకు అరెస్టులు మొదలుపెట్టిన పోలీసులు విడతల వారీగా నాయకులను అరెస్టు చేసి డీసీఎం వ్యాన్‌లలో భువనగిరి, ఘట్కేసర్, ఎల్‌బీనగర్, ఆదిభట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, దాసరి మల్లేశం, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా మూర్తి, బొమ్మ విజయ, సుదగాని హరిశంకర్‌గౌడ్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, పాశం భాస్కర్, మురళీధర్‌రెడ్డి, రంగా రామాగౌడ్, మాదిరెడ్డి సుభాష్ రెడ్డి, పక్కీరు రాజేందర్‌రెడ్డి, విక్రాంత్ రెడ్డి, తూంకుంట గణేష్ తదితరులు ఉన్నారు.

200 మంది పోలీసుల మోహరింపు
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ నేపథ్యంలో బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ వద్ద సుమారు 200 మంది పోలీసులను మోహరించారు. భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర ఆధ్వర్యంలో భువనగిరి ఏసీపీ వెంకట్ రెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ నర్సింహారెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డితో పాటు పది మంది సీఐలు, పది మంది ఎస్ఐలు, సివిల్ పోలీసులు, స్పెషల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రశ్నించిన గొంతులను నొక్కేస్తున్నారు
కేసీఆర్, కేటీఆర్‌లు పరీక్ష పత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహించకుండా ప్రశ్నించిన గొంతులను నొక్కేస్తున్నారని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. ఎలాంటి నోటీసులూ లేకుండా తీవ్రవాద శక్తులను అరెస్ట్ చేసిన మాదిరిగా బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రం తలచుకుంటే తెలంగాణలో ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తుందని, కేసీఆర్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నాడని, తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. లిక్కర్ స్కామ్‌లో కేసీఆర్ కూతురును ఈడీ చట్ట ప్రకారమే విచారణ చేస్తోందన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



బీజేపీ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

బీజేపీ కుట్రలో భాగమే పేపర్ల లీకేజీ
- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు
- సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్

బీజేపీని నిలదీయండి
- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

- వివరాలు 10లో

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- జగ్జీవన్‌రామ్, తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ

నల్లగొండ టూటౌన్ : భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నీలగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్, తెలంగాణ తల్లి విగ్రహాలను బుధవారం ఆయన జెడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో బాబూ జగ్జీవన్‌రామ్ ఒక శిల్పి అని, ఆయన ఏ ఒక్కరికో పరిమితం కాదని చెప్పారు. పరాయి పాలనలో దేశం వేయ్యేళ్లు వెనుకబడిందని.. మరోసారి మనువాదం ముందుకు రాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. మహనీయుల పోరాట స్ఫూర్తి, వారు చేసిన త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, బొల్లెటి ప్రభాకర్, దళిత సంఘాల నాయకులు బొర్ర సుధాకర్, మైనం శ్రీనివాస్, జగ్జీవన్‌రామ్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు కత్తుల షణ్ముఖకుమార్, జగ్జీవన్, కత్తుల జగన్, బకరం శ్రీనివాస్ మాదిగ, పాలడుగు నాగార్జున, అభిమన్యు శ్రీనివాస్, చక్రహరి రామరాజు, కటికం సత్తయ్యగౌడ్, సుంకరి మల్లేష్‌గౌడ్, కొండూరు సత్యనారాయణ, శరణ్యారెడ్డి, దొడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలు చల్లుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

దురుసు ప్రవర్తన.. దాడులు

- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ సిబ్బంది ఇష్టారాజ్యం

మిర్యాలగూడ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో నాలుగో తరగతి సిబ్బంది, రోగుల సహాయకుల ఇష్టారాజ్యం సాగుతోంది. తమ పరిధిని మించి వైద్యం చేయడంతోపాటు రోగుల బంధువులపై దాడులకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఈనెల 3న రాత్రి నేరేడుచర్ల మండలం సోమారం గ్రామానికి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చేరాడు. అతడికి వార్డు బాయ్ వైద్యం చేస్తుండగా.. అదే సమయంలో ఆ యువకుడి బంధువు పురుగుల మందు డబ్బా ఫొటో తీయడంతో.. సదరు వార్డు బాయ్ ఆవేశంగా సెల్‌ఫోన్ లాక్కుని పగులగొట్టాడు. ఈ విషయమై మంగళవారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు రోగి బంధువులు ఫిర్యాదు చేయగా అతని సెల్‌ఫోన్‌ను మరమ్మతు చేయించి ఇచ్చినట్లు తెలిసింది.

సిబ్బంది అంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..
ఆస్పత్రుల్లో రోగులకు సాయం చేసేందుకుగాను ప్రభుత్వం 2015లో సహాయకులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించింది. ఈ నియామక ప్రక్రియలో సూర్యాపేటకు చెందిన కాంట్రాక్టర్ అండతో మండలంలోని చిల్లాపురం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారంతా పైరవీలు చేసుకుని రోగుల సహాయకులుగా జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో చేరారు. ప్రస్తుతం వారంతా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ఒకేచోట పని చేస్తున్నారు. దీంతో ఆస్పత్రిల్లో వారి ఇష్టారాజ్యం సాగుతోంది. రోగుల నుంచి ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. రాత్రి సమయంలో రోగులను తమకు నచ్చిన ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి వారి నుంచి పర్సంటేజీలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎవరూ ఫిర్యాదు చేయలేదు
ఈనెల 3న కాంట్రాక్ట్ సిబ్బందితో జరిగిన ఘర్షణలో సెల్‌ఫోన్ కిందపడి పగిలిన విషయంపై నాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. నా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటా.
– శ్రీనివాస్ సమరద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

అక్రమాలకు అధికారులదే బాధ్యత

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరిగినా అందుకు పూర్తి బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, కస్టోడియన్లదే అని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, కస్టోడియన్లు, ఎంఈఓలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని.. సిబ్బంది కూడా జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాన్ని నో మొబైల్ జోన్‌గా ప్రకటించామని.. విధుల్లో పాల్గొనే వారంతా ఫోన్ తీసుకురావద్దని సూచించారు. పరీక్ష కేంద్రానికి వచ్చిన సిబ్బంది పరీక్ష ముగిసేవరకు ఎట్టి పరిస్థితిలోనూ బయటికి రావొద్దన్నారు. ప్రశ్న, జవాబు పత్రాలను పోలీస్ సిబ్బంది సహాయం లేకుండా పరీక్ష కేంద్రానికిగాని, పోలీస్ స్టేషన్‌కుగాని తరలించవద్దని చెప్పారు. ప్రశ్నపత్రాలపై వదంతులు వాట్సాప్ గ్రూపుల్లో గాని సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రచారం చేయొద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే పరీక్షల చట్టం 27/97 ప్రకారం ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానాకు శిక్షార్హులని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, డీఈఓ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

3,750 ఎకరాల్లో పంట నష్టం

- గుర్రంపోడు మండలంలో అధికారుల అంచనా



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గుర్రంపోడు : మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. 3,400 ఎకరాల్లో వరి పంట, 350 ఎకరాల్లో బత్తాయి, నిమ్మ తోటలు, కూరగాయల పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు క్షేత్ర పరిశీలనలో తేలింది. ప్రధానంగా నడికూడ, బొల్లారం, కొప్పోలు, వెంకటాపురం, కోయగూరవానిబావి, పిట్టలగూడెం, ఆములూరు గ్రామాల్లో నష్టం తీవ్రంగా వాటిల్లింది. 25 ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. పైకప్పులు లేచిపోయి ఇళ్లలో నిల్వ చేసుకున్న పత్తి తడిసిపోయింది. పిట్టలగూడెంలో డెయిరీఫాం కుప్పకూలింది. పొట్ట దశలో ఉన్న వరి వెన్నులు విరిగి 90 శాతం పంట నేలపాలైన ఆరుగాలం శ్రమించిన రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం..
పుచ్చ, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పుచ్చకాయలు పగిలిపోవడం, తీగ జాతి పందిళ్లు నేలమట్టమైనాయి. బత్తాయి, నిమ్మ కాయలు రాలిపోయాయి. చాలాచోట్ల నిమ్మ చెట్లు నేల కొరిగాయి. 70 కరెంటు స్తంభాలు విరిగినట్లు తెలిసింది. విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన స్తంభాలు అమర్చి కరెంట్ పునరుద్ధరించారు.

రక్తశుద్ధికి నరకయాతన

- డయాలసిస్ కేంద్రంలో మరమ్మతులకు గురైన ఏసీలు
- పట్టించుకోని జీజీహెచ్ అధికారులు
- ఉక్కపోతతో అల్లాడుతున్న రోగులు



డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు నరకయాతనను అనుభవిస్తున్నారు. డయాసిస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐదు ఏసీలకు గాను నాలుగు ఏసీలు మరమ్మతులకు గురై మూడు నెలలు దాటింది. అయినా అధికారులు వాటిని మరమ్మతులు చేయించలేదు. డయాలసిస్ చేయించుకోవడానికి వచ్చే రోగులు సుమారు ఐదు నుంచి ఆరుగంటల పాటు బెడ్‌పై పడుకోవాల్సి ఉంటుంది. బెడ్‌పై రెగ్జిన్ కవర్‌లు ఉండడం వల్ల వేడి ఉత్పన్నమవుతుంది. ఏసీలు పనిచేయకపోవడంతో బెడ్‌పై పడుకుంటే ఉక్కపోతతో పాటుగా రెగ్జిన్ కవర్‌ల నుంచి వచ్చే వేడి కారణంగా చర్మం మంటమండుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏసీలు చెడిపోయి మూడు నాలుగు నెలలు అవుతున్నా.. నిర్వాహకులు పట్టించుకోవడం లేదని తెలిసింది. తమ టెండర్ కాలపరిమితి ముగుస్తున్నందున నిర్వాహణను వదిలేశారనే విమర్శలు ఉన్నాయి.

నాలుగు షిఫ్టులతో డయాలసిస్..
ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని డయాసిస్ కేంద్రంలో పది మిషన్ల ద్వారా రోజూ నాలుగు షిఫ్టుల్లో నలభై మందికి డయాలసిస్ సేవలను అందిస్తున్నారు. రోజు విడిచి రోజు, వారానికి రెండు సార్లు, ఒకసారి, పది రోజులకు ఒకసారి, నెలనెల డయాలసిస్ చేయించుకోవడానికి జీజీహెచ్‌లోని కేంద్రానికి రోగులు వస్తుంటారు. ఏసీలు చెడిపోయినా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో రోగులకు పెద్దగా ఇబ్బందులు కలగలేదు. కానీ మార్చి, ఏప్రిల్ మాసం నుంచి ఎండల తీవ్రత పెరగడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. బెడ్‌పై ఐదారు గంటలు పడుకోవాల్సి ఉంటున్నందున చెమటలు కారుతూ, ఉక్కపోతతో చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు.

ఇష్టానుసారంగా ఇన్‌చార్జి వ్యవహార శైలి
డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు పేర్కొంటున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పడానికి కూడా అవకాశం ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించడంతో పాటుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్నీషియన్‌లు సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.

మొరాయిస్తున్న మిషన్‌లు..
ఏసీలు చెడిపోయిన కారణంగా డయాలసిస్ మిషన్లు కూడా మొరాయిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక్కోసారి డయాలసిస్ పూర్తి కాకుండానే మిషన్లు ఆగిపోతున్నాయి. పది మిషన్లలో రోజూ ఏదో ఒక మిషన్ మొరాయిస్తుండడంతో డయాలసిస్ చేయించుకోవడానికి వచ్చే రోగులకు సరైన సేవలు అందడం లేదు. అవసరమైతే మరో రోజు ఉండాల్సి వస్తోందని రోగులు ఆవేదన చెందుతున్నారు.

ప్రజలను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వాలు

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



జోడో యాత్రలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నాయని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ విమర్శించారు. బుధవారం దామరచర్ల మండలంలోని రాజగట్టు, నర్సాపురం, శాంతినగర్, పుట్టలగడ్డ తండాల్లో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ ఆస్తులను అప్పన్నంగా కట్టబెడుతోందన్నారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్తారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, హట్యానాయక్, మాళోతు శివ, ఆనంద్, కృష్ణనాయక్, ఆడోతు నాగునాయక్, శివచరణ్‌నాయక్, కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ చోరీ ఘటనలో ముగ్గురిపై కేసు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): బైక్ చోరీ ఘటనలో ముగ్గురిపై తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బాబులాల్ బైక్ 2016 సంవత్సరంలో చోరీకి గురైంది. దీంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయ్యింది. తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్ల తండాకు చెందిన ఆంగోతు మురళి ఆ బైక్ కలిగి ఉన్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో తిరుమలగిరి పోలీసులు మురళిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. బైక్‌కు సరైన ధ్రువపత్రాలు లేకుండానే అల్వాల అడ్డరోడ్డుకు చెందిన మానుపాటి ఆంజనేయులు వద్ద రూ.8వేలకు కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. తదనంతరం ఆంజనేయులును పోలీసులు విచారించగా దుబ్బ మోహన్‌రావు రూ. 6వేయిలకు అమ్మినట్లు తెలిపారు. మోహన్‌రావును విచారించగా తన షాపు వద్ద ఒక దొంగ కొంత కాలం క్రితం పార్క్ చేసి వెళ్లాడని అప్పటి నుంచి తానే ఆ బైక్‌ను వాడుకుంటున్నట్లు తెలిపారు. ఆ తరువాత ఆంజనేయులుకు రూ. 8వేయిలకు అమ్మినట్లు తెలిపారు. దీంతో ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరకొండ : అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చందంపేట మండలం నుంచి బుధవారం దేవరకొండ మీదుగా టాటా ఏస్ వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి తరలిస్తున్నారన్న పోలీసులకు సమాచారం అందింది. దీంతో తనిఖీలు నిర్వహించి దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి వద్ద పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

మిర్యాలగూడ అర్బన్: విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశ్‌నగర్‌కు చెందిన రైతు వినోద్‌కుమార్ తన వ్యవసాయ పొలంలోని గడ్డి కట్టలను పశువుల దానా కోసం ట్రాక్టర్‌పై ఇంటికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు గడ్డికి తగిలి మంటలు వ్యాపించాయి. గమనించిన వినోద్‌కుమార్ ట్రాక్టర్ ట్రాలీతో ఇంజన్‌ను వేరు చేయడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేసి ప్రమద తీవ్రతను తగ్గించారు. కాగా అధిక లోడుతో ట్రాక్టర్‌ను నడిపిన డ్రైవర్‌కు రవాణా చట్టం ప్రకారం జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ తెలిపారు.

బ్యాంకులో షార్ట్‌సర్క్యూట్.. ఫర్నిచర్ దగ్ధం

మేళ్లచెరువు : షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఫర్నిచర్ దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ బుధవారం సెలవు కావడంతో మూసి ఉంది. మధ్యాహ్న సమయంలో బ్యాంకు గదుల నుంచి పొగ రావడాన్ని స్థానికులు గమనించి బ్యాంక్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బ్యాంక్ సిబ్బంది, మైహోం పరిశ్రమ ఫైర్ సిబ్బంది వచ్చి తాళాలు పగులగొట్టి మంటలు ఆర్పివేశారు.ఈ ఘటనలో ఫర్నిచర్, క్యాష్ కౌంటర్, కంప్యూటర్ ఫైళ్లు దగ్ధమయ్యాయి. స్ట్రాంగ్ రూమ్‌కు మంటలు వ్యాపించక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

• బొమ్మలరామారంలో టెన్షన్.. టెన్షన్



బండి సంజయ్‌ను విడుదల చేయాలని బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం తెల్లవారుజామున నిరసనవ్యక్తం చేస్తున్న బీజేపీ శ్రేణులు



పోలీస్‌స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర



కాసం వెంకటేశ్వర్లును అరెస్టు చేసి వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్



మహిళా నాయకురాలిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం

- మరో చిన్నారికి గాయాలు
- అతివేగమే ప్రమాదాలకు కారణం

భువనగిరి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందగా ఓ చిన్నారికి గాయాలయ్యాయి. కొండమల్లేపల్లి, నల్లగొండ, భువనగిరి, కోదాడ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం హన్మాపురం గ్రామానికి చెందిన జడల సత్యనారాయణ(38), ముడుగుల శ్రీనివాస్(39) పని నిమిత్తం బైక్‌పై మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చారు. రాత్రి పది గంటల ప్రాంతంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో బంక్ వద్ద బైక్‌లో పెట్రోల్ పోసుకుని హన్మాపురం వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో జగదేవ్‌పూర్ నుంచి భువనగిరి వైపు అతివేగంగా వస్తున్న లారీ వీరి బైకును ఢీకొట్టింది ఈ ప్రమాదంలో జడల సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని తొలుత భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సైదులు తెలిపారు.

బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో..

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని వర్ధమానిగూడెం గ్రామానికి చెందిన రావుల శివ, జ్యోతి దంపతులు బతుకుదెరువు నిమిత్తం పదేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉంటూ పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. కాగా, రావుల శివ స్వగ్రామమైన వర్ధమానిగూడేనికి మంగళవారం బైక్‌పై చిన్న కుమార్తె బిందులో కలిసి వచ్చాడు. బుధవారం బైక్‌పై తిరుగు ప్రయాణం కాగా మార్గ మధ్యలో చిన్నఅడిశర్లపల్లి గేటు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో బైక్ నడుపుతున్న శివ(32)కు తీవ్ర, కుమార్తె బిందుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో తొలుత దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో శివ మృతిచెందాడు. అతివేగమే ప్రమాదానికి కారణమని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు పరారీలో ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



శివ (ఫైల్)

కాల్వలో పడి లారీడ్రైవర్..

కోదాడరూరల్ : చిలుకూరు మండలం ఆర్లెగూడెం గ్రామానికి చెందిన సాగర్లమోహన్‌రావు(52) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ ముగిసిన తర్వాత బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో బైక్‌పై కోదాడ నుంచి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఉత్తమ్‌పద్మావతినగర్ సమీపంలోని రైస్‌మిల్లు వద్ద టర్నింగ్‌లో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రమాద విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి కోదాడ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కాల్వలో మోహన్‌రావు మృతదేహం

స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ..

నల్లగొండ క్రైం : నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన ఉప్పల అజయ్‌కుమార్ (30) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అజయ్‌కుమార్ మంగళవారం రాత్రి గ్రామంలో ఓ నాయకుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత నల్లగొండలో స్నేహితుడిని కలిసేందుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో పానగల్ బ్రిడ్జి- ఖాజీరామారం స్టేజీ సమీపంలో ముందు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాని వెనకే బైక్‌పై వేగంగా వస్తున్న అజయ్‌కుమార్ అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య తేజస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



అజయ్‌కుమార్(ఫైల్)

చెట్టును ఢీకొని యువకుడు...

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన మద్దిరాల సాయి(24) ప్రైవేట్ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఎనిమిది మాసాల క్రితమే వివాహం జరిగింది. బుధవారం ఉదయం మునుగోడులో ఉంటున్న సోదరి ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి నల్లగొండకు వస్తుండగా మార్గమధ్యలో కంచనపల్లి- దీపకుంట రోడ్డు వద్ద చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

పునరావాసం కల్పించాలని వినతి

- నల్లగొండ ఎస్పీ అపూర్వరావును కలిసిన మాజీ మావోయిస్టు సత్యంరెడ్డి

నల్లగొండ క్రైం : పునరావాసం కల్పించాలని కోరుతూ మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు గజ్జల సత్యంరెడ్డి అలియాస్ గోపన్న బుధవారం నల్లగొండ ఎస్పీ అపూర్వరావును కలిసి వినతిపత్రం అందజేశారు. మావోయిస్టు ఉద్యమంలో పనిచేసిన విధానం, జైల్ జీవితం, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మిర్యాలగూడ జెడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి వివరించారు. ప్రభుత్వం నుంచి భూమి, ఇల్లు , ఆర్థికసాయం అందేలా చూడాలని కోరాడు. ఇప్పటికే ప్రభుత్వ పెద్దలు, మంత్రులను కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు.



మాజీ మావోయిస్టు సత్యంరెడ్డి

తెలంగాణ మావోయిస్టుల గురించి తెలియదు

తెలంగాణ ప్రాంతంలో ఉన్న మావోయిస్టులు, వారి కదలికల గురించి తెలియదని సత్యంరెడ్డి తెలిపారు. ఎక్కువగా ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశానని 'సాక్షి'కి తెలిపారు. హైదరాబాద్‌లో ఏవీఎం కాలేజీలో ఇంటర్ చదువుతున్న సమయంలో గ్రామానికి చెందిన గజ్జల రాంరెడ్డితో కలిసి 1980లో మావోయిస్టు ఉద్యమంలో చేరినట్లు తెలిపారు. 2006 నుంచి జైలు జీవితాన్ని 17 సంవత్సరాలు గడిపినట్లు తెలిపారు. జైలుకు వెళ్లిన తర్వాత మావోయిస్టులతో సంబంధాలు తెగిపోయాయని , ఆ రాష్ట్రంలో ఎవరైనా కలువడానికి వచ్చేవారు కాదని , ఒక వేళ వస్తే వారిపైనా కేసులు పెడతారని తెలిపారు. తనపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 70 కేసులు నమోదు చేసిందన్నారు. ఇన్ఫార్మర్లను హత్య చేసినట్లుగా కేసులను పెట్టినప్పటికీ అన్ని కేసులు కొట్టివేయడం ద్వారానే జైలు నుంచి బయటికి వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ఏర్పాటును ఛత్తీస్‌గఢ్ జైలులో ఉన్నప్పుడు పత్రికలో చదివానని, అప్పుడు ఎంతో సంతోషం కలిగిందన్నారు. జైలులో ఉన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోవడం, వారిని చూడలేకపోయాననే బాధ మిగిలిపోయిందన్నారు. మావోయిస్టులా ఉన్నప్పుడే సహచర మావోయిస్టు సభ్యురాలు కమలను వివాహం చేసుకోగా, ఆమె విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎదురుకాల్పుల్లో మృతి చెందిందన్నారు. రెండో వివాహం చేసుకున్న తర్వాత జైలుకు వెళ్లడంతో వివాహబంధం తెగిపోయిందన్నారు. గత మార్చి 24న జైలు నుంచి విడుదలైనట్లు తెలిపారు. జీవనోపాధి కోసం ప్రభుత్వ సహాయాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి నలుగురికి గాయాలు

ఆలేరురూరల్ : బైక్ అదుపుతప్పి కింద పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఆలేరులో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఝిలగండుల నాగరాజు, అతని భార్య లక్ష్మి, కుమారుడు అభిరామ్, అత్త కళావతితో కలిసి బుధవారం ఉదయం జనగాం జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొడవటూరులోని సిద్ధేశ్వరస్వామి ఆలయ దర్శనానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో పట్టణంలోని ఆర్వోబీ సర్వీస్ రోడ్డుపై గుంత ఉన్న చోట వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం జనగాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



గాయపడిన అభిరామ్

మహనీయుడు.. బాబు జగ్జీవన్‌రామ్

సూర్యాపేట క్రైం: అంటరానితనం నిర్మూలనకు ఎంతగానో కృషి చేసిన మాజీ ఉప ప్రధాని, దివంగత బాబు జగ్జీవన్‌రామ్ మహనీయుడని సూర్యాపేట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో బుధవారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పట్టుదల నిండిన ఆత్మ విశ్వాసంతో అడుగులు వేస్తూ తన రాజకీయ జీవితాన్ని ఆదర్శప్రాయంగా కొనసాగించారన్నారు. జగ్జీవన్‌రామ్ యావత్ భారత ప్రజానీకం గుండెల్లో నేటికీ సజీవంగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్‌ఐ నర్సింహ, సీసీఎస్ గౌరీనాయుడు, ఆర్‌ఐ గోవిందరావు, అడ్మిన్ ఆర్‌ఐ శ్రీనివాసరావు, ట్రాన్స్‌పోర్ట్ ఆర్‌ఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు రవీందర్, సత్యనారాయణ, హరికృష్ణ, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

పోలీసులు అంకితభావంతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి సూర్యాపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లాకు చెందిన 24మంది ఎస్‌ఐలు పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కేక్ కట్ చేసి, ఎస్‌ఐలుకు షీల్డులు అందజేసి శుభాకాంక్షలు తెలిపి అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రవీందర్, దానియేలు, యాకూబ్, సైదులు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

ఆశ్రమ పాఠశాలలో దుండగుడి హల్‌చల్

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలోకి మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ దుండగుడు చొరబడ్డాడు . 9వ తరగతి విద్యార్థినుల డార్మెంటరీ గదిలోకి ప్రవేశించాడు. విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషిస్తూ హల్ చేశాడు. నిద్రలో నుంచి లేచిన విద్యార్థినులు లైట్ వేయగానే అక్కడి నుంచి పారిపోయాడు. పాఠశాలలో ఆ సమయంలో నైట్ వాచ్‌మన్ రోజా, సీఆర్టీ ఉపాధ్యాయురాలు నస్రీన్‌బేగం ఉన్నారు. ఈ ఘటనపై స్పెషల్ ఆఫీసర్ అష్రఫ్‌ఉన్నిసాబేగం బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఎస్‌ఓ నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి సీఐ ఎస్.శ్రీనివాస్ కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఖదీర్, సేవానాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ఉద్యోగులది కీలకపాత్ర



టీఎన్‌జీఓస్ డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ఉద్యోగులది కీలక పాత్ర అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రవి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సూర్యాపేట జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, 2023 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో సంఘం నాయకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడంలో ఉద్యోగుల పాత్ర అమోఘమన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యోగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. 317 జీఓతో ఉద్యోగులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ విషయంలోనూ కొందరు రాజకీయాలు చేయాలని చూశారని, కానీ ఉద్యోగులు అర్థం చేసుకున్నారని తెలిపారు. పేపర్ల లీకేజీ కొందరి స్వార్థంతో జరుగుతుందని, దీన్ని రాజకీయం చేసి ప్రజలను, విద్యార్థులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. జిల్లాకేంద్రంలో ఎకరం స్థలంలో టీఎన్‌జీఓ భవనం నిర్మిస్తామని, స్థలం సేకరణ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జానిమియా, దున్నా శ్యాం, నాయకులు సుదర్శన్, ఫసీయుద్దీన్, అనంతరావు, ఆకాశ వర్మ, చింతలపాటి చినశ్రీరాములు, శ్రీరాములు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

మర్రిగూడ : కుక్కల దాడిలో 48 గొర్రె పిల్లలు మృతిచెందాయి. మర్రిగూడ మండలం వట్టిపల్లిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పానగల్ మండలం జమ్మిపూర్ గ్రామానికి చెందిన అన్న రమేష్ 15 రోజుల క్రితం గొర్రె పిల్లలతో మండలానికి చేరుకున్నాడు. ఆయా గ్రామాల్లో గొర్రె పిల్లలను మేపుకుంటూ ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వట్టిపల్లిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దొడ్డిలో గొర్రెపిల్లలను తోలి నిద్రించాడు. రాత్రి సమయంలో కుక్కలు దాడి చేయడంతో 48 గొర్రె పిల్లలు మృతిచెందగా మరో మూడు గాయపడ్డాయి. మృతిచెందిన 48 గొర్రె పిల్లల విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి తనకు నష్ట పరిహారం అందించాలని బాధితుడు రమేష్ కోరారు.



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రె పిల్లలు

సంజయ్‌ని విడుదల చేయాలి

బొమ్మలరామారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను భేషరతుగా విడుదల చేయాలని ఆ పార్టీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు పీవీ.శ్యామ్‌సుందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బొమ్మలరామారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంజయ్‌ని అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేపర్ లీకేజీ పాల్పడిన వ్యక్తులను వదిలి సంజయ్‌పై రాజకీయ కక్షకు పాల్పడుతున్న తెలంగాణ ప్రభుత్వ విధానాలు ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో నాయకులు దాసరి మల్లేశం, పడాల శ్రీనివాస్, రంగా రాముగౌడ్, కొలను చంద్రశేఖర్‌రెడ్డి, జగ్గర్ల ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌రావు

ఇనుపాములలో డ్రిప్ పైప్‌లైన్ ధ్వంసం



గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన డ్రిప్ పైప్‌లైన్

కేతేపల్లి: కూరగాయల పంట సాగుకు వేసిన డ్రిప్‌పైప్ లైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇనుపాముల గ్రామానికి చెందిన రైతు మాచర్ల గాలయ్య తనకున్న ఎకరం వ్యవసాయ భూమిలో వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేశాడు. పంటకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి నుంచి డ్రిప్ పైప్‌లైన్ వేయించాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూరగాయల మొక్కల వెంట పరిచిన డ్రిప్‌లైన్‌ను ముక్కలుగా నరికి ధ్వంసం చేశారు. పంటను తొక్కి చెట్లను పీకేశారు. పంటను ధ్వంసం చేయటం వల్ల తనకు దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు గాలయ్య తెలిపాడు. పంటను ధ్వంసం చేసిన వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

పండ్ల తోటలకు పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు

- వేసవిలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గుర్రంపోడు ఏఓ మాధవరెడ్డి సూచనలు

గుర్రంపోడు : వేసవిలో అగ్ని ప్రమాదాలు పొంచి ఉండి పండ్లతోటల రైతులను కలవరపాటుకు గురిచేస్తాయి. 20 ఏళ్లపాటు దిగుబడులు ఇచ్చే బత్తాయి, నిమ్మలాంటి తోటలు అగ్ని ప్రమాదాలకు గురైతే రైతుకు ఆర్థికంగా కోలుకోవడం కష్టమే. కరువుకు తోడైన అగ్ని ప్రమాదాలు రైతుకు గోరుచుట్టు రోకటి పోటుగా మారి తీవ్ర నష్టం కల్గిస్తాయి. ప్రతి యేటా వేసవిలో జరుగుతున్న అగ్నిప్రమాదాలతో కాలిన పండ్లతోటలకు నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నా పరిహారం అందిన దాఖలాలు లేవు. రైతులు వేసవిలో జాగ్రత్తలు పాటించి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి అందిస్తున్న సూచనలు, సలహాలు ఆయన మాటల్లో..



తేనపల్లి తండాలో ఇటీవల కాలిన బత్తాయి తోట (ఫైల్)

పాడి పంట

జాగ్రత్తలు

- → రైతులు మోటార్ల సర్వీసువైర్లు, కేబుల్ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలి. నేల మీద వైర్లు లేకుండా చూసుకోవాలి. వేడిమికి షార్ట్‌సర్క్యూట్‌తో ఎండిన ఆకులు నిప్పంటుకుంటాయి.
- → విద్యుత్ సర్వీసు వైర్లు, ఫ్యూజుల నుంచి స్టార్టర్ల వరకు గల వైరు నాసిరకంగా ఉంటే లోఓల్టేజీతో వేడెక్కి కాలిపోయి మంటలు అంటుకుని వ్యాపించే అవకాశం ఉంది.
- → స్టార్టర్ డబ్బాలు నేలపై అడ్డంగా ఉంచడం వల్ల ఎలుకలు దూరి వైర్లు కత్తిరించడం వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగి పక్కనే గల ఎండు ఆకులకు మంటలు అంటుకుంటాయి.
- → తోటల్లో కరెంటు స్తంభాల మధ్య లూజ్ లైన్ లేకుండా చూసుకోవాలి. లూజ్‌లైన్ల వల్ల గాలిదుమారాలకు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు నేలపైబడి కింది గడ్డికి అంటుకుంటాయి.
- → తోటల్లో చెట్ల మధ్యలో వేసవికి ముందే దున్నుకోవాలి.కలుపు మందులు వాడితే ఎండిన గడ్డిని పీకి వేయాలి.
- → ఎట్టి పరిస్థితుల్లో వేసవిలో తోటల్లో చెత్తకు నిప్పుపెట్టకూడదు.
- → తోటల చుట్టూ జీవకంచె ఏర్పాటు చేసుకోవాలి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు అదుపులో ఉండేందుకు కంచె మధ్యలో ఎడం ఉండేలా ఖాళీ స్థలం ఉంచుకోవాలి.
- → తోట గెట్ల వెంట గడ్డి వాములు ఉంచకూడదు.
- → అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తోటల్లో అంతరకృషి లేకుండా ఎండు గడ్డి బాగా ఉంటే డ్రిప్ లాటరల్ పైపులు కాలిపోయి తీవ్ర నష్టం జరుగుతుంది.

క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణ మహోత్సవం

కనగల్ : మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ యజ్ఞం, సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ కారింగు పార్వతమ్మజానయ్యగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటలకు హనుమాన్ ఊరేగింపు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పోరెళ్ల సునిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.
శాలిగౌరారం : ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కేతేపల్లి : మండలకేంద్రంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికను అధికారులు బుధవారం నిర్వహించారు. సహకార సంఘంలో 9 స్థానాలకు రెండు వర్గాల ప్యానెల్‌ల నుంచి 17 మంది పోటీలో నిలిచారు. మొత్తం 85 మంది సభ్యులు ఉండగా 77 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. డైరెక్టర్‌లుగా ఒక ప్యానల్ నుంచి టంగుటూరి సైదులు, తండు సురేష్, భీమనపల్లి నరేష్(ముగ్గురు), మరో ప్యానల్ నుంచి మాందాసు వెంకటయ్య, దిండిగాళ్ళ వెంకన్న, అయితగోని సురేష్, భీమనపల్లి వెంకన్న, మారగోని లచ్చయ్య, మారగోని వెంకన్న (ఆరుగురు) విజయం సాధించారు.

బలగం సినిమా ప్రదర్శన

మర్రిగూడ : మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద సర్పంచ్ నల్ల యాదయ్య ఆధ్వర్యంలో బుధవారం బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. గ్రామస్తులు చిత్రాన్ని వీక్షిస్తూ తమ కుటుంబాల సాధకబాధకాలను గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు పందుల రాములుగౌడ్, చెరుకు శ్రీరాములుగౌడ్, పాల్గొన్నారు.
శాలిగౌరారం : 'బలగం' చిత్రాన్ని మండలంలోని చిత్తలూరు గ్రామంలో బుధవారం రాత్రి ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దాసరి వెంకన్న ప్రజల కోసం ప్రదర్శించారు. బస్టాండ్ ఆవరణలో ఎల్ఈడీ టీవీ ద్వారా సినిమా ప్రదర్శించారు.

కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుల నియామకం.. రద్దు

నకిరేకల్, కట్టంగూర్, నార్కట్‌పల్లి : నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కట్టంగూర్, నార్కట్‌పల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ బుధవారం డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ ఉత్తర్వులు జారీచేశారు నకిరేకల్ మండల అధ్యక్షుడిగా నోముల గ్రామానికి చెందిన యాసా కరుణాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా నకిరేకల్‌కు చెందిన లింగాల వెంకన్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నియామక పత్రాలను టీపీసీసీ డెలికేట్ సుంకరబోయిన నర్సింహయాదవ్ వారికి నియామక పత్రాలు అందజేశారు. కట్టంగూర్ మండల అధ్యక్షుడిగా కట్టంగూర్‌కు చెందిన ముక్కాముల శేఖర్‌యాదవ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడిగా నార్కట్‌పల్లి-3 ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నకిరేకల్ నియోజకర్గంలో కమిటీలను రద్దు చేస్తున్నట్లు టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం రాత్రి ప్రకటించారు. దీంతో ఈ విషయం పార్టీలో చర్చనీయాంశమైంది.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండలంలోని చినమాదారం గ్రామ పంచాయతీ పరిధి తంగెళ్లవారిగూడెం గ్రామానికి చెందిన తలమల్ల సురేందర్-కుమారి దంపతులు కుమార్తె స్వప్న మాధురి(13) అనారోగ్యంతో మృతిచెందింది. చిన్నారి కుటుంబానికి బుధవారం ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెండే విజయపెద్దులు, వార్డు మెంబర్ నర్సింగ్ రామనారాయణ, చిమట వీరయ్య, తలమల్ల నాగయ్య, చనగాని యాదయ్య, ఎల్లయ్య, సైదులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ అధ్యక్షుడికి సన్మానం

నల్లగొండ : పీఆర్‌టీయూ నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన డీవీఎస్ ఫణికుమార్ బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, రాష్ట్ర కార్యదర్శి కమలాకర్‌రావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నూతన అధ్యక్షుడు ఫణికుమార్‌ను సన్మానించారు. జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సంఘంలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని రాష్ట్ర సంఘం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, వెంకట్‌రెడ్డి, మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం జయంతిని నల్లగొండ జిల్లా కేంద్రంతోపాటు నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రాం విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు.

–సాక్షి నెట్‌వర్క్


నకిరేకల్‌లో జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి


నల్లగొండ : నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు, సిబ్బంది


నల్లగొండ : జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈఓ, సిబ్బంది


నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు


తిప్పర్తిలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు


చండూరు : నివాళులర్పిస్తున్న ఎంపీపీ కళ్యాణి


మునుగోడు : ఎంపీడీఓ కార్యాలయంలో ..


చిట్యాలలో పూలమాల వేస్తున్న దేవదాసు


కనగల్ : తహసీల్దార్ కార్యాలయంలో ..


కట్టంగూర్ : ఎంపీడీఓ కార్యాలయంలో ..


కేతేపల్లిలో..


నార్కట్‌పల్లి : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో..


మర్రిగూడ : శివన్నగూడెంలో ..


శాలిగౌరారం ఎంపీడీఓ కార్యాలయంలో..

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

నాంపల్లి : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లకు ప్రభుత్వం నిధుల విడుదల చేసి పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 14 నుంచి మే 14 తేదీ వరకు నియోజకవర్గంలో నిర్వహించే ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు రాగిఫణి అంజాచారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి ఊరుపాక వెంకటయ్య, రాజు, ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు జగన్, స్వామి, సత్తిరెడ్డి, సత్తయ్య, చంద్రారెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.
మర్రిగూడ : పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల నిరంజన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంగౌడ్, బూడిద సురేష్, పాండు రంగారావు, బుర్ర శేఖర్, ఆకుల రఘుమయ్య, ఎరుకల యాదయ్య, యాదిరెడ్డి, ఐతగోని వెంకటయ్య, గిరి, మహేందర్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల, పెద్దకాపర్తి గ్రామాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హ్యాపీనెస్ ప్రోగ్రాం, సుదర్శన క్రియ సమ్మర్ క్యాంపు ప్రచార కరపత్రాలను బుధవారం ఆయా గ్రామాల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా కో ఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు, పెద్దకాపర్తి సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి విడుదల చేశారు. పొట్లపల్లి నర్సింహగౌడ్, సిలివేరు సుగుణమ్మ, చంద్రయ్య, చిలువేరు నర్సింహ, చేకూరి గణేశ్, నాగచారి పాల్గొన్నారు.

బండి సంజయ్ అరెస్ట్‌పై బీజేపీ ఆందోళనలు

నల్లగొండ టూటౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ బుధవారం బీజేపీ నాయకులు నల్లగొండ పట్టణంలోని భాస్కర్ టాకీస్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతెపాక సాంబయ్య పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం కుట్రపూరింతగా బండి సంజయ్‌పై అక్రమ కేసులు మోపి అరెస్టు చే యడం దుర్మార్గమన్నారు. కాగా బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయినవారిలో వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, కంకనాల నాగిరెడ్డి, దాసోజు యాదరాచారి, రావెల్ల కాశమ్మ, చర్లపల్లి గణేశ్, ఆవుల మధు తదితరులు ఉన్నారు.
నల్లగొండ రూరల్ : బండి సంజయ్‌ని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం నల్లగొండ మండలంలోని మేళ్ల దుప్పలపల్లి గ్రామంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బోగరి అనిల్ కుమార్, మండల కార్యదర్శి నర్సింహ, కిసాన్ సెల్ నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, శ్రీకాంత్, సునీల్, కార్తీక్, శ్రీనాథ్ పాల్గొన్నారు.
చిట్యాల : బండి సంజయ్ అరెస్ట్‌కు నిరసనగా చిట్యాల పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, పెద్దకాపర్తిలో మండల రూరల్ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీజేపీ బూత్ అధ్యక్షుడు కుక్కల నాగరాజు, ఉపాధ్యక్షుడు పాల రవివర్మ, జిట్ట విష్ణు, నక్కబోయిన నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లపు బుద్ధుడు, గంటోజు నాగాచారి, తెల్జూరి నర్సింహ, గుండెబోయిన నర్సింహ, పొట్లపల్లి చంద్రయ్య, వడ్డెపల్లి మురళి పాల్గొన్నారు. బండి సంజయ్ అరెస్ట్‌కు నిరసనగా చిట్యాలలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టేందుకు వెళుతున్న బీజేపీ నాయకులను బుధవారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీను, చికిలంమెట్ల అశోక్, మహాలింగం, మాస శ్రీనివాస్, పల్లె వెంకన్నగౌడ్, జిట్ట కృష్ణ, కోళ్ల స్వామి, కుక్కల నాగరాజు, జిట్ట విష్ణు, పాల రవివర్మ తదితరులు ఉన్నారు.
కట్టంగూర్ : బండి సంజయ్ అరెస్ట్‌కు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టేందుకు వెళుతుండగా కట్టంగూర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో బీజేపీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, మండల అధ్యక్షుడు నూకల సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పసుల సైదులు, పులకరం శంకర్, బసవోజు వినోద్, గడ్డపాటి శంకర్, నీలం నాగరాజు ఉన్నారు.


నల్లగొండ మండలంలోని మేళ్ల దుప్పలపల్లిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మునుగోడు : బండి సంజయ్ అరెస్ట్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ముందస్తుగా బీజేపీ నాయకులను ఎస్ఐ డి.సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, జిల్లా కార్యదర్శులు వేదాంతం గోపినాథ్, దర్శనం వేణుకుమార్, నాయకులు బూడిద లింగయ్యయాదవ్, బొడిగే అశోక్‌గౌడ్, పందుల భాస్కర్, పాలకూరి యాదయ్యగౌడ్, దుబ్బ రాజు, జెల్లయ్య, సాగర్ల లింగస్వామి, సునీల్ సులేమాన్ ఉన్నారు.
నాంపల్లి : బండి సంజయ్ అరెస్ట్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా స్థానిక బీజేపీ నాయకులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి శ్రీశైలం, శివగౌడ్, శ్రీకాంత్, శివ, జంగయ్య తదితరులు ఉన్నారు.
చండూరు : బండి సంజయ్ అరెస్టును ఖండిస్తూ చండూరు మున్సిపల్ కేంద్రంలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నెపర్తి యాదగిరి మాట్లాడుతూ బండి సంజయ్ అరెస్టును ఖండిస్తున్నామని అన్నారు. అరెస్టయినవారిలో దోటి వెంకటేష్‌యాదవ్, కొత్తపాటి సతీష్, గిరిధర్, ఏనుగు వెంకట్‌రెడ్డి, పేర్ల గణేష్, ఇరిగి వెంకటేశం, అంజిబాబు, యువమోర్చా అధ్యక్షుడు సోమ శంకర్, మాదగోని స్వామి, ప్రవీణ్, శివ, వేణు, వెంకటేశం, జగదీష్, సాయి, నరేష్, సాగర్, రామకృష్ణ, శంకర్ తదితరులు ఉన్నారు.

మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి

బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా చండూరు మున్సిపల్ కేంద్రంలో బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మాదగోని నాగార్జున, కొత్తపాటి సతీష్, రఘుమారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిజిలి యాదయ్య, సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ కారింగు సాయికుమార్, బూత్ అధ్యక్షుడు తిరందాసు శ్రీను తదితరులు పాల్గొన్నారు.
కనగల్ : బండి సంజయ్ అరెస్ట్ సందర్భంగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు బయలుదేరిన కనగల్ బీజేపీ మండల అధ్యక్షుడు పులకరం భిక్షంతో సహా 11మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు కనగల్ ఎస్ఐ నాగేష్ తెలిపారు. అరెస్టయిన వారిలో బెజవాడ స్వామి వివేకానందగౌడ్ ఉన్నారు.


నల్లగొండలో రాస్తారోకో చేస్తున్న నాయకులు


చిట్యాల : పెద్దకాపర్తిలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మర్రిగూడ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బుధవారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, అమరేందర్, కొట్టం మాధవిరమేష్, నిర్మలలూర్దయ్య, జంగిలి రవి, లెంకలపల్లి ఎంపీటీసీ ఎరువుల శ్రీశైలం, రాజేంద్రనాయక్, పరుశురాం గౌడ్, జమ్ముల వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.
నకిరేకల్ : బండి సంజయ్ అరెస్టును ఖండిస్తూ బుధవారం నకిరేకల్‌లో బీజేపీ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు పల్స శ్రీనుగౌడ్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బుడిగె సైదులు, జిల్లా డాకయ్య, తాటికొండ రామ్మూర్తి, మైల శ్రీనివాస్, అప్పం అంజయ్య, జాని, నారగోని వెంకటేశ్వర్లు, మిర్యాల యాదగిరి, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.
కేతేపల్లి : బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమానికి సిద్ధమవుతున్న బీజేపీ నాయకులను బుధవారం కేతేపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి, నర్సింహాచారి, జటంగి రాంచంద్రయ్య, చెరుకు రోషయ్య, చంద్రశేఖర్ ఉన్నారు.
శాలిగౌరారం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ నేపథ్యంలో మండలంలోని బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టకుండా ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేశారు. అరెస్టయినవారిలో బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్, నాయకులు వినోద్, వెంకటేశ్వర్లు, రాజు, యాదయ్య, సత్యనారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, మధు ఉన్నారు.


నకిరేకల్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


చండూరు : మూతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కేంద్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

కట్టంగూర్ : బీఆర్ఎస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే దేశాభివృద్ధి జరుగుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని మునుకుంట్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేపర్ లీకేజీ వెనుక బీజేపీ కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణను అధోగతిపాలు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, మండల అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు, పున్నంరాజు సత్యనారాయణ, గద్దగూటి ఆంజనేయులు, వల్లపు లింగయ్య, శివ, వెంకటరాములు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఊట్కూరి భిక్షం, మల్లికార్జున్, పెద్దోళ్ల చంద్రయ్య, అయిటిపాముల విజయ్, ఊట్కూరి రాజు ఉన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

లేబర్‌కోడ్‌లను కేంద్రం రద్దుచేయాలి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నెహ్రూగంజ్‌లో నల్లజెండాలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నర్సింహ, హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అవురేషి మారయ్య, కార్యదర్శి కారింగు రవి, వీరబాబు, నాగరాజు, సురేష్, వెంకన్న, కృష్ణయ్య, వీరయ్య పాల్గొన్నారు.
చిట్యాల : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాలలో బుధవారం సీఐటీయూ, రైతు, మహిళ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్రూరి శ్రీను, కత్తుల లింగస్వామి, ఐతరాజు నర్సింహ, జిట్ట సరోజ, రమాదేవి, అండాలు, కడగంచి నర్సింహ, ఏళ్ళ మారయ్య, పాల లక్ష్మయ్య, ఏనుగు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


చిట్యాల : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కనగల్ : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు ప్రతిఘటించడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి పిలుపునిచ్చారు. బుధవారం మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కనగల్ హమాలీ అడ్డా వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల కమిటీ సభ్యులు పిన్నపురెడ్డి శేఖర్‌రెడ్డి, పాశం మల్లికార్జున్, నాగయ్య, ఈదయ్య, భిక్షం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చడానికే అక్రమ కేసులు

నల్లగొండ టూటౌన్ : లిక్కర్ స్కాం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే బండి సంజయ్‌పై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ, టెన్త్ పేపర్ లీకేజీ ప్రభుత్వ అసమర్థత వల్లే జరిగిందని అన్నారు. ఆత్మరక్షణలో పడిన ప్రభుత్వం బండి సంజయ్‌పై కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వీరెల్లి చంద్రశేఖర్, హరి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జన్మోత్సవం

రామగిరి(నల్లగొండ) : రామగిరిలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి జన్మోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.


పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

స్వీపింగ్ మిషన్ ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీలో రహదారుల పరిశుభ్రత కోసం రూ.90లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్‌ను జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారులను విస్తరించినందున కార్మికులకు ఇబ్బంది లేకుండా మిషన్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, కమిషనర్ రమణాచారి, గ్రంథాలయ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

7న సీపీఐ సమావేశం

చిట్యాల : ఈ నెల 7వ తేదీన నకిరేకల్‌లో సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు. చిట్యాలలో బుధవారం పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, బొల్లూరు లింగయ్య, మేకల భిక్షం, రావుల చినవెంకన్న, బాలరాజు, దండిగ నర్సింహ పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం


నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు బుధవారం నల్లగొండ పటణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కొమ్మనబోయిన సైదులు, సత్యనారాయణ, శివ, పృథ్వి, సతీష్, శబరి, ప్రవీణ్, గణేశ్, పాల్గొన్నారు.

'పేపర్ లీకేజీల వెనుక బీజేపీ కుట్ర'

కనగల్ : పేపర్ లీకేజీల వెనుక బీజేపీ కుట్ర ఉందని ఎంపీపీ కరీంపాషా, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కనగల్ పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదయ్యగౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కదారి కృష్ణయ్య పాల్గొన్నారు.